సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం, 15, మార్చి, 2023



పరిహారం ఇవ్వరా?

నకిలీ విత్తనాలతో దిగుబడి రాక నష్టపోయిన రైతులకు పరిహారం అందడం లేదు.

వివరాలు 8లో ▸



పరవశించిన మనిగిళ్ల

పెద్దమందడి మండలం మనిగిళ్లలో చేపట్టిన 'అక్షరదీక్ష'తో గ్రామం పరవశించింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.4 /19.6

మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉండి ఉక్కపోస్తుంది. సాయంత్రం నుంచి మేఘావృతమై ఉంటుంది. రాత్రికి చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు న్యాక్ బృందం రాక



జడ్చర్ల టౌన్: యూజీసీ న్యాక్ బృందం బుధ, గురువారాల్లో జడ్చర్లలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనుంది. బెంగుళూరు యూజీసీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులున్న బృందం మంగళవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రాయానికి చేరుకున్నారు. బృందానికి రిచాచోప్ర (కరఘ్‌పూర్ ఐఐటీ) చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తుండగా.. మెంబర్ కోఆర్డినేటర్లుగా కైలాస్ అగర్వాల్ (రాజస్థాన్), ఆంథోనిరాజ్ (తమిళనాడు) ఉన్నారు. వీరికి శంషాబాద్ విమానాశ్రయం వద్ద కళాశాల ప్రిన్సిపల్ అప్పియాచిన్నమ్మ, వైస్ ప్రిన్సిపల్ రవీందర్‌రావు ఇతర అధ్యాపక బృందం స్వాగతం పలికారు. అక్కడి నుంచి వారికి జడ్చర్లలో బస ఏర్పాటు చేసిన ప్రాంతానికి చేరుకున్నారు. ముగ్గురు సభ్యులున్న బృందం బుధ, గురువారాల్లో కళాశాలలో పర్యటించనున్నారు. తొలిరోజు మధ్యాహ్నం 2 గంటలకు పూర్వ విద్యార్థులతో సమావేశం కానున్నారు. న్యాక్ పర్యటనకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



భూత్పూర్: పత్తి విత్తన కంపెనీల యజమానులు లూజ్, గడువు తీరిన నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. మంగళవారం భూత్పూర్‌లోని వసంత సీడ్స్, ఆద్య సీడ్స్, సాయితేజ ప్రాసెసింగ్ యూనిట్, మవాసస్ ప్రాసెసింగ్ యూనిట్, సుదివ్వ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, పాలమూరు సీడ్స్, మా ఆగ్రో బయోటెక్ పత్తి విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లను తనిఖీ చేశారు. ప్రాసెసింగ్ రిజిస్టర్‌లను కచ్చితంగా నిర్వహించాలని, లైసెన్స్‌లను ప్రాసెసింగ్ యూనిట్ నందు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఫౌండేషన్ విత్తన రిజిస్టర్, లాట్, వెరైటీల ప్రకారం స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ప్యాకెట్‌పై వ్యాలిడిటీని కచ్చితంగా ముద్రించాలని, ఏదైనా అవకతవకలు ఉన్నట్లు తెలిస్తే విత్తన చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏడీఏలు హైమావతి, ఆంజనేయులు, యశ్వంత్‌రావు, ఆంజనేయులుగౌడ్, ఏఓ మురళీధర్, మహబూబ్‌నగర్ అర్బన్ ఏఓ శ్యాంసుందర్, మిడ్జిల్ ఏఓ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఈ నెల 19న జరిగే రాష్ట్రస్థాయి బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలికల అథ్లెటిక్స్ జట్టును బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–16 పైబడిన బాలికలు ఎస్‌ఎస్‌సీ మెమోతో కోచ్ సునీల్‌కుమార్‌ను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ నం .94406 56162, 94921 77535లకు ఫోన్ చేయాలని సూచించారు.

ముగిసిన అలివేలుమంగ ఉత్సవాలు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ దిగువన వెలసిన అలివేలుమంగతాయారు ఉత్సవాలు ముగియడంతో శ్రీవేంకటేశ్వర స్వామి, అలివేలుమంగతాయారు దేవతామూర్తులను సోమవారం రాత్రి పల్లకీలో గుట్టపై ఉన్న స్వామివారి గర్భగుడికి తీసుకెళ్లారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఈ పల్లకీసేవ ముందుకు కదిలింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



దళారుల చేతిలో విలవిల..!

- మార్కెటింగ్ సౌకర్యం లేక నష్టపోతున్న మత్స్యకారులు
- వేలం పాట ద్వారా చెరువుల అమ్మకాలు
- లోపాయికారీగా సహకరిస్తున్న సంబంధిత అధికారులు
- మార్కెట్ల ఏర్పాటుపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో నిష్ప్రయోజనమవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మత్స్య పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించి మత్స్యకారుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. చేపల వేట, వృత్తిపై ఆధార పడి బతుకుతున్న మత్స్యకారులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిని అవకాశంగా మలచుకున్న దళారులు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. గ్రామాల్లోని మత్స్య సొసైటీలను తమ గుప్పిట్లో పెట్టుకొని వేలం పాటల ద్వారా చెరువులు దక్కించుకుంటున్నారు. ఫలితంగా దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోవడమే కాకుండా వృత్తిపై మరింత మెరుగ్గా జీవనం సాగించేలా అవగాహన కల్పించడం లేదు. మత్స్యకారుల అవసరాలను ఆసరా చేసుకొని వారిని నిండా ముంచుతున్న దళారులపై ఆ శాఖ అధికారులు ఎలాంటి చర్యలకు సాహసించడం లేదు. కొన్నిచోట్ల మత్స్య శాఖ అధికారులే దళారులతో చేతులు కలిపి సొసైటీల పరిధిలో ఉన్న చెరువులు వేలం పాటలో దక్కేలా సహకరిస్తున్నారు. ఎన్ఎఫ్‌డీబీ ద్వారా చేపల మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. మహిళా మత్స్యకారులు చిన్నచిన్న యూనిట్లు నెలకొల్పేలా మత్స్యశాఖ ప్రోత్సాహం అందిస్తుంది. మత్స్యకార సొసైటీల్లోని సభ్యులకు మార్కెట్ల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తే మరింత మేలు జరిగే అవకాశముంది.

నీరుగారిన సమీకృత పథకం

మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అమలు చేసిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకం లక్ష్యాన్ని చేరడం లేదు. టూ, 3 చక్రాల వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు వంటివి మత్స్యకారులకు 80 శాతం సబ్సిడీపై గతంలో అందజేశారు. ఈ పథకంలో పెద్దఎత్తున వాహనాలను పొందినవారు వృత్తిరీత్యా కాకుండా ఇతర పనులకు వినియోగించాల్సిన పరిస్థితి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. చేపల వ్యాపారాన్ని పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకొని చెరువులు, మత్స్య సొసైటీలను శాసిస్తున్న దళారులు తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

జిల్లాలో రెండు చోట్ల

జిల్లాలో రెండు చోట్ల చేపల మార్కెట్లు ఉన్నా వాటిలో ఎలాంటి సౌకర్యాలు లేవు. మహబూబ్‌నగర్‌లో చేపల మార్కెట్ భవన నిర్మాణం జరుగుతుండగా.. జడ్చర్లలోని చేపల మార్కెట్‌లో తగిన సౌకర్యాలు కల్పించడం లేదని మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై 1.84 కోట్ల చేపపిల్లలను చెరువులు, కుంటలు, రిజర్వాయర్‌లలో వదలగా గత జనవరి వరకు 7,085 టన్నుల చేపల ఉత్పత్తి జరిగినట్లు మత్స్యశాఖ అంచనా వేసింది. ప్రతి సంవత్సరం చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల నుంచి దిగుబడి వచ్చే చేపల ఉత్పత్తులను హైదరాబాద్, బెంగళూరు, బొంబాయి వంటి ప్రాంతాలకు తరలించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.


మండల, జిల్లాకేంద్రాల్లో..



మత్స్యకారులు గ్రామాల్లోని **చెరువుల్లో** ఉత్పత్తి చేసుకునే చేపలను విక్రయించుకునేలా జిల్లాకేంద్రంతో పాటు మండలకేంద్రాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. మార్కెటింగ్ సౌకర్యం లేక దళారుల బారినపడి మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. – బాలగోపి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, కొనగట్టుపల్లి

ప్రతిపాదనలు పంపలేదు

మత్స్యకారులు చేపలు విక్రయించేందుకు జిల్లాలో మార్కెటింగ్ సదుపాయం ఇబ్బందిగా ఉన్నమాట వాస్తవమే. గతంలో దేవరకద్రలో చేపల మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చినా స్థలం లేకపోవడంతో నిలిచింది. మార్కెట్ల ఏర్పాటుకు ఇప్పటి వరకైతే ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. – రాధారోహిణి, జిల్లా మత్స్యశాఖ అధికారి



- మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు **195**
- స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టనున్న సొసైటీలు **33**
- జిల్లాలో చెరువులు, కుంటలు **1,086**
- మహిళా మత్స్య సొసైటీలు **20**
- మొత్తం సభ్యులు **11,932**
- సభ్యులకు అవకాశం **1,135**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్రమైన రహదారి భద్రతా ప్రణాళిక తయారు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో రహదారి భద్రతా జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స నిమిత్తం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరఫున ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్ఓ కృష్ణను ఆదేశించారు. జాతీయ రహదారుల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న గుర్తించిన ప్రదేశాల్లో కారణాలపై అధ్యయనం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆస్పత్రులకు తరలించేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, ఆస్పత్రులను ఎంపిక చేయాలని, అంబులెన్స్‌లు, ట్రాక్ కేంద్రాలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రహదారులపై ప్రమాదాలు సంభవించకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా రోడ్లపై సైన్ బోర్డులతోపాటు రేడియం స్టిక్కర్లు, జీబ్రా లైన్లు, స్టాపేజీలు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. అనుమతులు లేని సామర్థ్యానికి మించి ఎక్కువ మందిని తరలించే వాహనాలపై దృష్టిసారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ జిల్లాలో 3 జాతీయ రహదారులు, 2 అంతర్రాష్ట్ర రహదారులు ఉన్నాయని, వీటిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. ఎన్‌హెచ్‌పై ట్రామా కేర్ సెంటర్లు లేవని, యూటర్న్ క్రాసింగ్‌ల దగ్గర ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అలాగే పట్టణ పరిధిలో సైతం జీబ్రా క్రాసింగ్ లేకపోవడం, ఎక్కువ యూటర్న్ ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రామాకేర్ సెంటర్లతోపాటు అంబులెన్స్‌లను పెంచాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, ఆర్టీఓ డిప్యూటీ కమిషనర్ దుర్గాప్రమీల, ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, ఆర్అండ్‌బీ ఈఈ స్వామి, పీఆర్‌ఈఈ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



పట్టణంలో హాథ్‌సే హాథ్ జోడోయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎస్.వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని 29వ వార్డులో మంగళవారం హాథ్‌సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. అనంతరం నాయకులు గడపగడపకు తిరుగుతూ రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర సందేశాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనతో ప్రజలు విసుగు చెందారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకుమార్‌గౌడ్, బెనహర్,వసంత, లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబా, సిరాజ్‌ఖాద్రీ, మల్లు నర్సింహారెడ్డి, కంచిమి లక్ష్మణ్, అజ్మత్‌అలీ, జగదీష్ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



నిర్వాసితుల రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ పద్మశ్రీ

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భూ సేకరణ సబ్ కలెక్టర్ పద్మశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఆమె ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక సర్వే చేపట్టారు. వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలు, తండాలకు సంబంధించి నష్టపరిహారం ఖరారుపై పూర్తిస్థాయిలో విచారించి సమ్మతించిన వారికి ప్రభుత్వం అందజేసే నష్టపరిహారంపై స్పష్టత ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పరిహారం ఖరారు విషయంలో అక్కడక్కడ కొందరు లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో నిర్వాసితుల నుంచి అభిప్రాయం తీసుకుంటున్నామన్నారు. దాదాపు 12 బృందాలతో ఆయా గ్రామాల నిర్వాసితుల ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి మరోసారి సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికార బృందాలు సర్వే నిర్వహించి ఖరారు చేసిన కొలతలు, తదితర వాటిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించడం, తాము చేసిన సర్వే ఆధారంగా లభించే పరిహారానికి నిర్వాసితుల అంగీకారాన్ని ధ్రువీకరించుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ అతిథి గృహంలో ఇందుకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, ఆయా కౌంటర్ల వద్ద నిర్వాసితులు తమ ఫిర్యాదులు, సమ్మతిని తెలియజేయాలని కోరారు. అయితే ఉదండాపూర్‌కు చెందిన కొందరు నిర్వాసితులు తమకు ఖరారు చేసిన పరిహారానికి సమ్మతించి సంతకాలు చేయగా మరికొందరు తమ కుటుంబంలో 18 ఏళ్లు నిండిన వారిని మరో కుటుంబంగా గుర్తించాలని కోరుతూ కొత్తగా నమోదు చేయించారు. మరో 10 రోజుల పాటు ముంపు గ్రామాలకు సంబంధించి ధ్రువీకరణ సర్వే కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,535

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగకి గరిష్టంగా రూ.7,535, కనిష్టంగా రూ.5,080 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,225, కనిష్టంగా రూ.1,989, పెబ్బర్లు గరిష్టంగా రూ.5,139, కనిష్టంగా రూ.4,492, కందులు గరిష్టంగా రూ.7,769, కనిష్టంగా రూ.7,670, ఆముదాలు గరిష్టంగా రూ.6,470, కనిష్టంగా రూ.6,349, ఉలువలు రూ.5,213, రాగులు రూ.3,069 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,319, కనిష్టంగా రూ.6,269గా ధరలు నమోదయ్యాయి.

- దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉదయం పది గంటల నుంచి ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు. వారానికి ఒకసారి జరిగే ఈ వేలంలో స్థానిక వ్యాపారులతో పాటు, ఇతర మార్కెట్‌లకు చెందిన వ్యాపారులు, చిరు వ్యాపారులు పాల్గొనే అవకాశం ఉంది.

క్వారీని ఆపే వరకు దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మోహన్

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం శివారు కురుమూర్తిగుట్టలో కొనసాగుతున్న క్వారీ పనులు నిలిపేసే వరకు దీక్ష కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ అన్నారు. అక్రమంగా కొనసాగుతున్న క్వారీ పనులను నిలిపి వేయాలని రైతులు చేపట్టిన దీక్షకు మంగళవారం ఏడోరోజు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి గుట్ట వెనక భాగంలో అక్రమంగా తవ్వి రాళ్లను తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అధికారులు వెంటనే క్వారీ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం కార్ల్‌మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, జగన్, హన్మంతు, భగవంతు, రాజు, కురుమూర్తి, రేణుక, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనీస పెన్షన్ పెంపు కోసం రాస్తారోకో

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల విశ్రాంత ఉద్యోగుల కనీస పెన్షన్ పెంపుదలపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టినట్లు ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి నాయకులు రాజసింహుడు, కొండయ్య, చంద్రశేఖర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు పాల్గొనాలని వారు కోరారు.

ఆలస్యమైతే నో ఎంట్రీ..!

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 32 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 20,224 మంది విద్యార్థులు
- అమలు కానున్న నిమిషం నిబంధన
- 144 సెక్షన్ అమలు, జిరాక్సు సెంటర్ల మూసివేత
- లాటరీ ద్వారా ఇన్విజిలేటర్ల కేటాయింపు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు లాంగ్వేజ్–1 పరీక్ష జరగనుండగా.. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా 32 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇందులో 20 కేంద్రాలు ఒక్క జిల్లాకేంద్రంలో, మిగతావి మండల కేంద్రాల్లో ఉన్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 10,802 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 9,422 మంది పరీక్ష రాయనున్నారు. ఈ మేరకు మంగళవారం పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను డీఐఈఓ వెంకటేశ్వర్లు కేంద్రాలను తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరాపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాలు, మండల కేంద్రాల నుంచి జిల్లాకేంద్రానికి పరీక్షలు రాసేందుకు వచ్చే వారు సకాలంలో చేరుకునేలా బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీకి జిల్లా అధికా రులు సూచించారు. ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండగా.. 9 తర్వాత వచ్చే వారిని అనుమతించరు. ఇందుకు నిమిషం నిబంధనను అమలు చేస్తున్నారు. 8గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించనున్న నేపథ్యంలో ముందుగానే రావాలని సూచిస్తున్నారు.

సెల్‌ఫోన్లు తేవొద్దు..

పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లను అనుమతించమని అధికారులు పేర్కొంటున్నారు. ఇన్విజిలేటర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్‌సైతం ఫోన్లు తీసుకెళ్లినా సీఎస్‌డీఓ ఆధ్వర్యంలో డిపాజిట్ చేసి, పరీక్ష అనంతరం తీసుకోవాలని సూచిస్తున్నారు. పరీక్ష జరిగినంత సేపు బయటికి లోపలికి ఎవరూ వెళ్లకూడదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. విద్యార్థులు ఎలక్ట్రిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, చీటీలు తీసుకురావద్దని, ఒకవేళ తెస్తే మాల్‌ప్రాక్టీస్ కేసులు బుక్ చేస్తామని చెప్పారు. అలాగే ఇన్విజిలేటర్ల పేర్లను డబ్బాలో వేసి లాటరీ పద్ధతిలో రూంలకు పంపించనున్నారు.



బాలుర జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్ వేయడాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ వెంకటేశ్వర్లు

మొత్తం విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు	ఫ్లయింగ్ స్క్వాడ్	సిట్టింగ్ స్క్వాడ్
20,224	32	3	3

పటిష్ట భద్రత..

పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట భద్రత ఏర్పాటు చేయనున్నారు. ప్రతి కేంద్రం వద్ద పోసులీలను నియమించి 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ముఖ్యంగా 2 ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఓ ఏఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ లెక్చరర్ ఉంటారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను 3 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయి. వీటితోపాటు గతానికి భిన్నంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుంది. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల చుట్టుపక్కల జిరాక్సు కేంద్రాలను మూసివేయనున్నారు. వేసవికాలం కావడంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక ఏఎన్‌ఎంను అందుబాటులో ఉంచుతారు.

ఎస్కార్ట్ తప్పనిసరి..

పరీక్ష కేంద్రాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే అధికారులు అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను భద్రపర్చారు. అయితే ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రానికి తీసుకువచ్చే క్రమంలో పోలీస్ ఎస్కార్ట్ తప్పనిసరిగా ఉండేలా చూస్తున్నారు. పరీక్ష 9 గంటలకు ప్రారంభమైతే ఉదయం 8 గంటలకు ప్రశ్నపత్రాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు ప్రశ్నపత్రాన్ని సీసీ కెమెరాల ముందు మాత్రమే ఓపెన్ చేయాల్సి ఉంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం..

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా వసతులు కల్పిస్తున్నాం. కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకురావొద్దు. లాటరీ ద్వారా ఇన్విజిలేటర్లను కేటాయించాలి. 144 సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాల మూసివేత కచ్చితంగా పాటించాలి. – వెంకటేశ్వర్లు, డీఐఈఓ

క్లుప్తంగా

పాముకాటుతో వ్యక్తి మృతి

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లి స్టేజీ సమీపంలో ఉన్న హోటల్‌లో పనిచేస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి సోమవారం రాత్రి పాము కాటేసింది. ప్రసాద్‌ను యజమాని రమేష్ అంబులెన్స్‌లో అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి చనిపోయాడు. యజమాని ఫిర్యాదుమేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. 20రోజుల క్రితం హోటల్‌లో పనికి కుదిరిన ప్రసాద్‌కు సంబంధించిన వివరాలు తెలియవని యజమాని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రసాద్‌కు సంబంధించిన వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో లేదా అచ్చంపేట సర్కిల్ కార్యాలయంలో తెలియజేయాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వరికోత యంత్రం మీద పడి వ్యక్తి..


జయన్న (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు వరికోత యంత్రం మీద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కేశవరంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం వరకు వరికోత కోసిన యంత్రం మొరాయించింది. దీంతో రాత్రి సమయంలో యంత్రాన్ని జాకీలతో పైకిలేపి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు జాకీలు జారిపోవడంతో వరికోత యంత్రం జయన్న(35)పై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన జయన్నను కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. జయన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

గద్వాల క్రైం: చికిత్స పొందుతున్న ఓ మహిళ పరిస్థితి విషమించి మృతిచెందింది. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లికి చెందిన సరస్వతమ్మ(56) సోమవారం ఉదయం పనినిమిత్తం బైక్‌పై కుమారుడు కుర్వ రామదాసుతో కలిసి గద్వాలకు వస్తున్నారు. అయితే గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సరస్వతమ్మను చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మక్తల్: మక్తల్ మండలం అంకేన్‌పల్లిలో గ్రామానికి చెందిన బోంపలిల కిష్టప్ప(52) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అప్పు ఇప్పించలేదని తండ్రిపై దాడి

గోపాల్‌పేట: మద్యానికి బానిసైన కొడుకు తనకు అప్పు ఇప్పించకపోడంతో తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చాకల్‌పల్లి చెందిన యాదగిరిచారి కుమారుడు శివశంకర్‌చారి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో ఎవరితోనైనా రూ.50వేలు తనకు అప్పుగా ఇప్పించాలని కొంతకాలంగా తండ్రిని వేధిస్తున్నాడు. శనివారం డబ్బులు అనవసర ఖర్చు చేస్తున్నావని తండ్రి చెప్పడంతో ఆగ్రహానికి గురైన శివశంకర్ కర్రతో యాదగిరిచారిని తలపై బలంగా కొట్టాడు. ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొంది మంగళవారం యాదగిరిచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గొలుసు దొంగకు జైలుశిక్ష

అచ్చంపేట రూరల్: ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కుని వెళ్లిన యువకుడికి అచ్చంపేట సివిల్ కోర్టు జడ్జి విజయ్‌కుమార్ ఆరు నెలల జైలు శిక్ష విధించారని అచ్చంపేట ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆ వివరాలు... సూర్యాపేట జిల్లాకు చెందిన వీరబాబు గతేడాది పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కుని వెళ్లాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ కోణాల్లో విచారణ చేసి, సీసీ కెమెరాల ఆధారంగా ఆ యువకుడిని గుర్తించారు. మంగళవారం అచ్చంపేట సివిల్‌కోర్టు జడ్జి ఎదుట అన్ని ఆధారాలతో హాజరుపర్చగా జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడికి రిమాండ్

ఆత్మకూర్: బాలికను కిడ్నాప్ చేసిన సంఘటనలో నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ కేఎస్ రత్నం తెలిపారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలికను అదేగ్రామానికి చెందిన యువకుడు కిడ్నాప్ చేశాడు. గతనెల 19న బాలిక అపహరణకు గురి కాగా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. కర్నూల్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో బాలికను సురక్షితంగా ఇంటికి చేర్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మంగళవారం రిమాండ్‌కు మహబూబ్‌నగర్ సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

పరిహారం ఇవ్వరా?


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు (ఫైల్)

- విత్తన మార్పిడితో వందల ఎకరాల్లో నష్టం
- ధ్రువీకరించిన శాస్త్రవేత్తలు, అధికారులు
- రెండేళ్లయినా అందని పరిహారం

దేవరకద్ర రూరల్: నకిలీ విత్తనాలు అంటగట్టడంతో దిగుబడి రాక నష్టపోయిన రైతులకు ఏళ్లుగా పరిహారం అందడం లేదు. న్యాయం చేస్తామన్న అధికారుల హామీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. సదరు విత్తన కంపెనీ మరియు స్థానికంగా వాటిని విక్రయించిన వ్యాపారులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ పరిస్థితిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవరకద్ర మండల పరిధిలో చాలామంది రైతులకు పలువురు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగట్టారు. వాటిని సాగు చేసేందుకు రూ.లక్షల్లో అప్పులు చేసి రైతులు పెట్టుబడి పెట్టారు. దాదాపు వంద ఎకరాలకు పైగా నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితిపై బాధిత రైతుల అభిప్రాయాలతో 2021 ఏప్రిల్ 3న 'కనిపించని దిగుబడి– విత్తన మార్పుతో రైతులకు తీవ్ర నష్టం' శీర్షికన 'సాక్షిలో' కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు, మరుసటి రోజు శాస్త్రవేత్తల సహకారంతో బాధిత రైతుల పంట పొలాల్లో శాంపిల్స్‌ను సేకరించి విత్తన మార్పిడి జరిగినట్లుగా గుర్తించారు. ఈ విషయంపై బాధిత రైతులకు న్యాయం చేయడంతో పాటు, నకిలీ విత్తనాలను అంటగట్టిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. రెండేళ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికీ పరిహారం అందలేదు.

నష్టం జరిగింది ఇలా...

వరిలో జేజీఎల్–24423 రకాన్ని సాగు చేయడం ద్వారా నాణ్యమైన విత్తనంతో పాటు, అధిక దిగుబడులు పొందవచ్చు అనే శాస్త్రవేత్తల సలహాతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు దేవరకద్రలోని అగ్రి దుకాణంలో శ్రీ విష్ణు సీడ్స్ కంపెనీకి చెందిన జేజీఎల్–24423 రకాన్ని కొనుగోలు చేసి వందల ఎకరాల్లో వరిని సాగు చేశారు. ముఖ్యంగా మీన్గోనిపల్లి, డోకూర్ గ్రామాల పరిధిలోని రైతులు ఈ రకాన్ని ఎక్కువగా సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో గింజ తాలుగా మారడంతో పాటు, సాధారణంగా వీచే గాలులకు సైతం గింజలు రాలిపోయాయి. గతంలో ఇదే రకాన్ని సాగు చేయగా నాణ్యమైన విత్తనంతో పాటు, అధిక దిగుబడి వచ్చింది. ఈసారి పరిస్థితి భిన్నంగా మారడంతో మోసపోయామని రైతులు గ్రహించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సహకారంతో బాధిత రైతులు పంట నుంచి తీసిన శాంపిల్స్‌ను పరిశీలించగా విత్తన మార్పిడి జరిగినట్లుగా నిర్ధారణ అయింది.

పరిహారం ఏది?

విత్తన మార్పిడి విషయంలో బాధిత రైతులకు జరిగిన నష్టంపై శాస్త్రవేత్తలు అందించిన నివేదిక ఆధారంగా వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలు తయారు చేసిన కంపెనీపై, వాటిని రైతులకు విక్రయించిన వ్యాపారులపై కోర్టులో కేసు వేసినట్లుగా అప్పట్లో తెలిపారు. అలాగే బాధిత రైతులకు వెంటనే న్యాయం అందించే విధంగా సేకరించిన అన్ని ఆధారాలను తీసుకొని వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘటన జరిగి రెండేళ్లు అవుతున్నా నష్టపోయిన రైతులకు ఇంతవరకు ఎలాంటి న్యాయం జరుగలేదు. పరిహారం పొందే విషయంలో న్యాయం కొరకు ఎలా ముందుకు వెళ్లాలో తెలియక ఆలస్యం జరిగినట్లు తెలుస్తుంది. అధికారులు చొరవ తీసుకొని నష్టపరిహారం తొందరగా అందేలా చేయడంతో పాటు, నకిలీ విత్తనాలను అంటగట్టిన దుకాణ యజమానులపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.


కనిపించని దిగుబడి పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనం

రూ.లక్షల్లో నష్టపోయా..



గ్రామంలో నాకు ఉన్న 6 ఎకరాలలో జేజీఎల్–24423 రకం వరిని సాగు చేశాను. పంట కొత దశ వచ్చే వరకు వివిధ సార్లు రూ.2లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. మేము సాగు చేసిన పంటకు విత్తనం రాకపోవడంతో దిగుబడి రాలేదు. వ్యవసాయ అధికారులకు సమాచారం ఇస్తే విత్తన మార్పిడి వల్లే దిగుబడి రాలేదని నివేదిక ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్లవుతున్నా నష్టపరిహారం మాత్రం అందలేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, డోకూర్ గ్రామం, బాధిత రైతు

బాధిత రైతులకు న్యాయం చేయాలి



నకిలీ విత్తనాలతో నష్టపోయిన బాధిత రైతులకు అధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి. నాణ్యమైన విత్తనాల పేరిట నకిలీ విత్తనాలు అంటగట్టడంతో వందల ఎకరాల్లో నష్టంతో పాటు, చాలామంది రైతులం రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పెద్దఎత్తున నష్టపోయాం. రైతులకు జరిగిన నష్టం తీర్చేవిధంగా తొందరగా పరిహారం ఇప్పించాలి.

– సత్యనారాయణ రెడ్డి, మీనుగోనిపల్లి, బాధిత రైతు

పరిహారం అందేలా చూస్తాం



విత్తన మార్పిడితో నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి, వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధిత రైతులు పరిహారం పొందేందుకు అవసరమైన అన్ని నివేదికలను వారికి ఇప్పటికే అందించాం. ఫోరం నుంచి వచ్చే ఆదేశాలతో బాధిత రైతులకు పరిహారం అందుతుంది.

– యశ్వంత్‌రావు, ఏడీఏ

కాళ్ల పారాణి ఆరకముందే.. కడతేర్చాడు!

- అనుమానంతో నవ వధువు, అత్తను హత్య చేసిన పెళ్లికొడుకు
- అడ్డుకోబోయిన మామపై దాడి.. ఆస్పత్రిలో చికిత్స
- పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్లిన రోజే దారుణం
- కర్నూలులో ఘటన.. వనపర్తిలో విషాదం



గాయపడిన వెంకటేశ్వర్లు.. రుక్మిణి (ఫైల్)


వనపర్తిలో వధువు ఇల్లు


వనపర్తి: పెళ్లిచేసుకున్న రెండు వారాలకే.. అనుమానంతో భార్యను, అత్తను కడతేర్చాడు ఓ కసాయి భర్త. వనపర్తి జిల్లాకేంద్రంలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్వర్లు, రమాదేవి అలియాస్ జ్యోతి(45)ల కుమార్తె రుక్మిణి(21)కి ఏపీలోని కర్నూలుకు చెందిన శ్రావణ్‌తో ఈ నెల 1న వనపర్తిలో వివాహం చేశారు. ఇప్పటికీ పెళ్లి వేడుక జరిగిన ఇంటి గుమ్మానికి కట్టిన తోరణాలు పూర్తిగా వాడక ముందే.. కాళ్లకు పెట్టిన పారాయణి ఆరకముందే.. 14రోజుల వ్యవధిలోనే మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో వనపర్తికి వచ్చి కాపురానికి తీసుకువెళ్తున్నట్లుగా పెళ్లి కూతురు రుక్మిణి, ఆమె తల్లి రమాదేవి, తండ్రి వెంకటేశ్వర్లును మంగళవారం కర్నూలులోని చింతలమునినగర్‌లోని తమ ఇంటికి తీసుకువెళ్లారు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే తల్లీకూతుళ్లపై కూరగాయలు కోసే కత్తితో శ్రావణ్ దాడి చేస్తుండగా.. వెంకటేశ్వర్లు అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అప్పటికే తీవ్రంగా గాయపడిన జ్యోతి, రుక్మిణి అక్కడికక్కడే మృతిచెందగా.. వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అడ్డుకుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెళ్లి చేసుకున్న రెండు వారాలకే.. భార్యపై అనుమానంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో వనపర్తిలోని ఎన్టీఆర్ కాలనీలో విషాదం అలుముకుంది. వారి ఇంటికి తాళం వేసుకొని ఉంది. ఉదయం కర్నూలుకు వెళ్లే ముందు పలుకరించారని, అంతలోనే ఈ వార్త వినాల్సి వచ్చిందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. కర్నూలు ఆస్పత్రిలో మృతదేహాల వద్ద ఎవరూ లేకపోవడంతో వనపర్తి పోలీసులు జ్యోతి బంధువులకు సమాచారం ఇచ్చి కర్నూలు వెళ్లాలని సూచించారు.

ఫార్మా కంపెనీ వద్దని కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మహమ్మదాబాద్: తమ ప్రమాదకరంగా మారే మందుబిళ్లల తయారీ కంపెనీ నెలకొల్పవద్దంటూ మండలంలోని దేశాయిపల్లి గ్రామస్తులు కలెక్టర్ రవినాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నంచర్లగేట్ దేశాయిపల్లి పరిధిలో మినీ ఇండస్ట్రీలో పెయింట్ తయారీ కంపెనీ చాటున ఏర్పాటు చేసిన ఫార్మాను వెంటనే రద్దు చేయాలని వినతిలో కోరారు. వ్యవసాయం ముఖ్యంగా గ్రామంలో పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడ్డ రైతులు ఎక్కువగా ఉన్నారని, మినీ ఇండస్ట్రీ చుట్టూ వ్యవసాయ పొలాలు ఉన్నాయని వివరించారు. ఒకవేళ ప్రమాదకర రసాయన పదార్థాలు బయటికి వెలువడి కాలుష్యమైన పొగతో వాతావరణమే కాకుండా తాగునీరు కూడా కలుషితమవుతుందని వాపోయారు. గ్రీన్ జోన్‌లో ఉన్న కంపెనీలకు అనుమతులు ఇచ్చారు కానీ, రెడ్‌జోన్‌లో ఉంటున్న కంపెనీని ఏర్పాటు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సర్పంచ్ రఘు తెలిపారు. కలెక్టర్‌గా ప్రత్యేక చొరవ తీసుకుని ఫార్మా కంపెనీ దగ్గరకు వచ్చి స్వయంగా పరిశీలన చేపట్టాలని కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఫార్మా కంపెనీ విషయమై మినీ ఇండస్ట్రీ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

వేప పిండి లాభాలు


వేప చెట్టు


వేప పొడి


వేప చెక్క

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వేప ఉత్పత్తులను పంటల సస్యరక్షణలో సమగ్ర పోషక యాజమాన్యంలో ఉపయోగిస్తారు. కీటకాలను సమర్థవంతంగా ఎదుర్కొనే అజాడి రక్తిన్ వేప గింజలో ఎక్కువగా ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ తెలిపారు. దీనిలో వేప గింజల నుంచి పిండిని తయారు చేసి పంటలకు ఉపయోగించవచ్చని, వేప పిండిలో ఉండే లక్షణాలు, ఉపయోగాలను ఆయన రైతులకు వివరించారు.

వేపపిండిలో పోషకాలు

100 కిలోల వేప పిండిలో 3.56 కిలోల నత్రజని, 0.83 కిలోల భాస్వరం, 1.67 కిలోల పోటాషియం ఉంటుంది. వీటితోపాటు కాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఐదు కిలోల వేప పిండిని 200 లీటర్ల నీటిలో 12 గంటలు నానబెట్టి దానిని పలుచటి గుడ్డతో వడగట్టి వచ్చిన ద్రవాన్ని పంటలకు పిచికారి చేయాలి.

కూరగాయ పంటల్లో..

టమాటలో ఎకరానికి 200కిలోల వేప పిండి వేయడం వలన పూత రాలడం, కాయ తొలుచు పురుగులను తగ్గించవచ్చు. టమాటను ఆశించే పాము పొడ పురుగును వేప పిండితో తయారు చేసిన 50 శాతం ద్రవాన్ని మొక్కలు నాటిన 10 నుంచి 15 రోజుల్లో పిచికారీ చేయడం వలన నివారించు.

- క్యాలీఫ్లవర్‌లో ఎకరానికి 100 కిలోల వేప పిండి వాడటం వలన కుళ్లు తెగులు రాకుండా నివారించవచ్చు.

వాణిజ్య పంటల్లో..

పత్తిలో ఎకరానికి 50 కిలోల వేప పిండి వాడటం వలన వేరుకుళ్లును పూర్తిగా అరికట్టవచ్చు. యూరియాలోని నత్రజని ఎక్కువ కాలం అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో వినియోగించుకుంటాయి.

పండ్ల తోటల్లో ..

మామిడి, బత్తాయి తోటల్లో 3 కిలోల వేప పిండిని ఏడాది వయస్సు ఉన్న మొక్కలకు వాడాలి. దీంతో కాండం తొలుచు, వేరు తొలుచు పురుగులను నివారించవచ్చు. పూత వచ్చే, పిందె సమయంలో 5 శాతం వేప ద్రావణం పిచికారీ చేసి చీడ పీడల నుంచి కాపాడుకోవచ్చు.

పూలతోటల్లో..

కనకాంబరం, లిల్లీ, మల్లె తోటల్లో వేప పిండిని వాడటం వలన నులిపురుగులను సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

ఆహార ధాన్యాల్లో..

వరి పంటలో వేప పిండిని యూరియాతో 5:1 నిష్పత్తిలో చల్లితే త్వరగా చీడపీడలు ఆశించవు. 30 శాతం నత్రజని ఆదా అవుతుంది. మొక్కలు నత్రజని తీసుకోనే శక్తిని పెంచవచ్చు. ఎకరానికి 80 కిలోల వేప పిండిని వాడితే కాయ తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించవచ్చు.

- కంది, పెసర, మినుము, ఆముదం పంటల్లో ఎకరానికి 80 కిలోల వేప పిండి వాడటం వలన పురుగుల బెడద తగ్గించవచ్చు. 5 శాతం వేప కశాయం పిచికారీ చేయడం వలన రెక్కల పురుగుల గుడ్లు పొదగవు.
- వేరుశనగలో ఎకరానికి 100కిలోల వేప పిండి వాడటం వలన వేరు పురుగు, వేరు కుళ్లు, కాయకుళ్లు తెగులు నివారించవచ్చు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు


గాయాన్ని చూపుతున్న సుజాత

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో సోమవారం రాత్రి వీధి కుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన ఏర్పుల సుజాత, బాలుడు చిటిగోరి రమేశ్ వీధిలో వెళ్తుండగా కుక్కలు దాడిచేసి కాళ్లకు కరిచాయి. వెంటనే కుటుంబ సభ్యులు అచ్చంపేట ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కుక్కల దాడితో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భక్త భౌరమ్మ..

- వయసు 90 ఏళ్లు.. 45 ఏళ్లుగా శ్రీశైలానికి పాదయాత్ర

గట్టు: కర్ణాటకలోని జవర్గి ప్రాంతానికి చెందిన భౌరమ్మ వయసు 90 ఏళ్లు.. ఈమె 45 ఏళ్లుగా ప్రతి ఏటా స్వగ్రామం నుంచి శ్రీశైలానికి కాలినడకన చేరుకొని మల్లన్న, భ్రమరాంభిక అమ్మవార్లను దర్శించుకుంటుంది. శ్రీశైలానికి బయలుదేరిన ఆమె మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. కాసేపు ఇక్కడ సేదతీరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం మల్లన్న నామస్మరణ చేస్తూ పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఉగాది పండుగ రోజున దర్శనం చేరుకొని తిరుగు ప్రయాణం అవుతామన్నారు. ప్రాణం ఉన్నంత వరకు పాదయాత్ర చేస్తానని.. తనను మల్లన్ననే నడిపిస్తున్నారని చెప్పుకొచ్చింది. కర్ణాటకకు చెందిన మరో భక్తుడు కాళ్లకు కర్రలు కట్టుకొని పాదయాత్ర చేస్తూ కనిపించాడు.


పాదయాత్రలో కర్ణాటక భక్తురాలు భౌరమ్మ


కాళ్లకు కర్రలు కట్టుకొని

క్షయ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డా.రాజేశం అన్నారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం క్షయ వ్యాధి నియంత్రణపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా టీబీ అనుమానితులు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలని, ప్రతి నెలా వైద్యసిబ్బంది వారి ఆరోగ్య పరిస్థితులపై సమాచారం సేకరించాలన్నారు. జిల్లాలో టీబీ నియంత్రణ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్‌తో కలిసి జనరల్ ఆసుపత్రిలోని టీబీ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రపంచం ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డా.మహేష్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకట్‌దాస్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై డబ్ల్యూహెచ్‌ఓ బృందం ఆరా

బిజినేపల్లి: మండలంలోని వసంతాపూర్‌లో పాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మేళాను మంగళవారం డబ్ల్యూహెచ్‌ఓ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను, కంటి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులకు పలు ఆరోగ్య సూత్రాలు ఎలా పాటించాలో వివరించారు. వైద్యులు రాజశేఖర్, వైద్య బృందం సభ్యులు రాజేశ్వర్, సుజాత, శిరీష, పద్మజ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రాజేశం

గువ్వల @ క్రికెటర్

- అచ్చంపేట తరఫున బరిలో దిగిన ఎమ్మెల్యే బాలరాజు


బ్యాటింగ్‌కు దిగిన గువ్వల బాల్‌రాజు

మహబూబ్‌నగర్ క్రీడలు: అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు క్రికెటర్‌గా అవతారమెత్తాడు. మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ మైదానంలో జరుగుతున్న సీపీఎల్ (క్రిస్టియన్‌పల్లి ప్రీమియర్ లీగ్)లో మంగళవారం అచ్చంపేట ఏఆర్ఎం లెవన్ జట్టు తరఫున ఆయన బరిలో దిగాడు. బ్యాటింగ్‌లో విఫలమైన ఆయన బౌలింగ్‌లో సత్తా చాటి రెండు వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అచ్చంపేట 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అచ్చంపేట 14.5 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన థండర్స్ లెవన్ (మహబూబ్‌నగర్) 15 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 80 పరుగులకే పరిమితమైంది. మ్యాచ్ అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు మాట్లాడుతూ యువత క్రీడలను పట్టుదలతో ఆడాలన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు.

ప్రగతిభవన్‌లో నీటిపారుదల శాఖ బందీ: పొంగులేటి

బోనకల్: నీటిపారుదల శాఖ ప్రగతిభవన్‌లో బందీగా మారిందని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ఆళ్లపాడులో బోనకల్ బ్రాంచ్ కెనాల్ (బీబీసీ) కింద సాగర్ జలాలు అందక ఎండిపోతున్న మొక్కజొన్న, మిర్చి, వరి పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. వర్షాలు పుష్కలంగా కురిసి సాగర్ నిండా నీరున్నా అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల వైఫల్యంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని పొంగులేటి అన్నారు. బోనకల్ మండలంలోనే 500 ఎకరాల మేర పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఆరు తడి పంటలకు కూడా నీరు ఇవ్వలేనందుకు రాష్ట్రప్రభుత్వం సిగ్గుపడాలని దుయ్యబట్టారు. ఆళ్లపాడులో సర్పంచ్ మర్రి తిరుపతిరావు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట దీక్ష చేసినా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల వైఫల్యానికి నిదర్శనమని పొంగులేటి విమర్శించారు. ప్రజల్లో తిరిగే వారికి ఇరిగేషన్ శాఖ మంత్రి పదవి ఇచ్చి ఉంటే రైతులు తమ గోడును చెప్పుకునేవారని అభిప్రాయపడ్డారు.

ముగ్గురు లైన్‌మన్‌లకు సీఈఏ పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్)కు చెందిన ముగ్గురు లైన్‌మన్‌లకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఉత్తమ సేవా పురస్కారాలను ప్రదానం చేసింది. న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట, హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్ల లైన్‌మన్లు కె.ఈశ్వర్ రెడ్డి, డి.మల్లారెడ్డి, కొండూరు యాదయ్యకు పతకం, ప్రశంస పత్రాన్ని అందజేసింది. పురస్కారాలు అందుకున్న లైన్‌మన్‌లు మంగళవారం టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, డైరెక్టర్ జె.శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు.

రేవంత్‌ది కాంగ్రెస్‌కు పాడెకట్టే యాత్ర: గ్యాదరి కిశోర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్నది కాంగ్రెస్‌కు పాడె కట్టే యాత్ర తప్ప పాదయాత్ర కాదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఎద్దేవాచేశారు. చంద్రబాబు సంకలో చేరి తెలంగాణకు అన్యాయం చేయడానికి కారణమైన రేవంత్ అమరవీరుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వారు అమరులు కావడానికి కారణమే రేవంత్ అని ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌లతో కలిసి బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌పై కానీ బీఆర్‌ఎస్‌పై కానీ తప్పుడు, నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే రేవంత్‌రెడ్డిని బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. రేవంత్ వృత్తి బ్లాక్ మెయిలర్ అని విరుచుకుపడ్డారు. సమాచార హక్కు చట్టాన్ని బ్లాక్ మెయిలింగ్‌కు వాడుకునే రేవంత్, ఇప్పుడు కూడా వీటిపై సమాచారం తీసుకోవచ్చని హితవు పలికారు.

నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్

దేశానికి రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది

- ఆ నిర్ణయంపై మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నోట్ల రద్దు తరువాత నకిలీ కరెన్సీ, నల్లధనం పెరిగాయి
- ప్రధానిపై నమ్మకంతోనే గతంలో నోట్ల రద్దును సమర్థించాం
- కానీ చెప్పిన లక్ష్యాలలో ఏ ఒక్కటీ నెరవేరలేదు
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయిందని... ఈ నిర్ణయం వల్ల దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నోట్ల రద్దుతో నకిలీ కరెన్సీ తగ్గకపోగా 54 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయన్నారు. పెద్ద నోట్ల రద్దు, దాని పర్యవసానాలపై ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా శ్వేతపత్రం విడుదల చేయాలని చెప్పారు. బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కృష్ణమోహన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు దండే విఠల్, దేశపతి శ్రీనివాస్‌లతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దు విఫలమని కేంద్రమే అంగీకరించిందన్నారు. బీజేపీ చెప్పేదొకటి.. చేసేదొకటి అనేందుకు పెద్దనోట్ల రద్దు నిర్ణయమే ఉదాహరణని ఎద్దేవా చేశారు. ప్రధానిపై నమ్మకంతో అప్పట్లో నోట్ల రద్దు నిర్ణయాన్ని తాము సమర్థించామని, అయితే చెప్పిన లక్ష్యం ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. ఏ ప్రణాళిక, ఆలోచన లేకుండా ప్రధాని పెద్ద నోట్లను రద్దు చేశారని... ఈ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

నగదు చెలామణి పెరిగింది..

పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ కాబట్టే దీనిపై బీజేపీ నేతలు మాట్లాడటం లేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. చెలామణిలో ఉన్న నగదుపై కేంద్రం చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆయన విమర్శించారు. 2014కు ముందు దేశ జీడీపీలో 11 శాతం నగదు ఉండేదని, అదిప్పుడు 13 శాతానికి పెరిగిందన్నారు. అలాగే గతంతో పోలిస్తే పెద్ద నోట్ల వాడకం రెట్టింపయ్యిందని చెప్పారు. రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేసి తెచ్చిన రూ. 2 వేల నోటు వల్ల పెద్ద నోట్ల వాడకం విపరీతంగా పెరిగిందన్నారు. కొత్త నోట్ల ముద్రణకు మోదీ ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు ఖర్చు పెట్టిందని... ఈ మొత్తంతో ఒక ప్రాజెక్టు పూర్తయి ఉండేదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పట్టుకున్న నల్లధనమే రూ. 40 వేల కోట్లు..

పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం ఉండదని చెప్పిన ప్రధాని మాటలు అపహాస్యమయ్యాయని హరీశ్‌రావు విమర్శించారు. 592 కేసుల్లో రూ. 40 వేల కోట్ల నల్లధనం పట్టుకున్నారని చెప్పారు. బీజేపీ వేసే ప్రతి అడుగు పేదలపై పిడుగులా మారిందని, నీతి ఆయోగ్ నేతి బీరకాయలో నెయ్యి చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అప్పులు చేయడం.. తప్పులు చేయడం బీజేపీ విధానంగా మారిందని, కేంద్రం ప్రతిరోజూ చేస్తున్న అప్పు రూ. 4,618 కోట్లని ఆయన పేర్కొన్నారు. మోదీ హయాంలో రూ. కోటీ ఏడు లక్షల కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. పెద్ద నోట్ల మార్పు కోసం క్యూలలో నిలబడి 108 మంది మరణించారని, నోట్ల రద్దు కారణంగా 62 లక్షల మంది ఉపాధి కోల్పోయారన్నారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో రూ. 100 లక్షల కోట్లు అప్పు చేసిందని, దేశంలో అవినీతి, ఆకలి పెరిగిపోతోందని పేర్కొన్నారు. నోట్ల రద్దుతో 50 రోజుల్లో అంతా బాగుంటుందని భరోసా ఇచ్చిన పెద్దలు... ఇప్పుడు 2 వేల రోజులైనా ఏం మార్పు తెచ్చారని హరీశ్ ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ధరలు మూడింతలు పెరిగాయని ధ్వజమెత్తారు.

కాళేశ్వరంలో అవినీతిపై విచారణ జరపాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైఎస్ షర్మిల
- పార్లమెంట్ ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



ఢిల్లీలో వైఎస్ షర్మిలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలిస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: గతంలో బయటపడ్డ 2 జీ, బొగ్గు కుంభకోణాల కంటే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో భారీగా అవినీతి జరిగిందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కాళేశ్వరం కోసం రూ.1.20 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని...అందులో వేలాది కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దోచుకున్నారని షర్మిల మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా వైఎస్సార్‌టీపీ మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో షర్మిల పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి పార్లమెంట్ ముట్టడికి బయల్దేరే ప్రయత్నం చేయగా జంతర్ మంతర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు షర్మిలతో పాటు కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒక గంట తర్వాత విడుదల చేశారు.

ఎమ్మెల్యే లింగయ్యపై చర్యకు వినతి

సాక్షి, హైదరాబాద్ : మహిళలను కించపరిచేలా మాట్లాడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై చర్య తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డికి బీజేపీ మహిళా మోర్చా విజ్ఞప్తి చేసింది. బీజేపీ నాయకుల భార్యలను బీఆర్‌ఎస్ నేతలు ముద్దు పెట్టుకుంటారని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే లింగయ్యపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కమిషన్ చైర్‌పర్సన్‌కు మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి ఆధ్వర్యంలో కల్యాణం గీతారాణి, శ్యామల, డాక్టర్ మాలతీలత ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యేకు బెదిరింపు కాల్స్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు వెంటనే క్షమాపణ చెప్పకపోతే అంతు చూస్తామని మూడు రోజులుగా ఫోన్‌లో వరస బెదిరింపులు వస్తున్నాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. మరోవైపు.. మహిళా కమిషన్ అధికారులు లింగయ్యకు ఫోన్ చేసి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వ్యాఖ్యలపై వివరణ కోరారు.

రూ.300 కోట్ల ప్రాజెక్టుకు.. రూ.3,500 కోట్లు

- కమీషన్ల కోసమే మంచిప్ప ప్రాజెక్టుకు రీడిజైన్లు : రేవంత్‌రెడ్డి



మంచిప్ప వద్ద కాళేశ్వరం 21 ప్యాకేజీ పనులను పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జలయజ్ఞంలో భాగంగా నాడు చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం రీడిజైన్లు చేసిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 20, 21, 22 ప్యాకేజీల కింద చేపట్టిన మంచిప్ప జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 0.84 టీఎంసీల సామర్థ్యం కలిగిన కొండెం చెరువు పనులను రూ.900 కోట్లతో 75 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. తక్కువ ముంపుతోనే 1.84 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు డిజైన్ చేశారని గుర్తు చేశారు. ఇంకా రూ.300 కోట్లు ఖర్చు చేస్తే జలాశయం పనులు పూర్తయి పొలాలకు నీరందుతుందని చెప్పారు. అయితే కేవలం కమీషన్లు దండుకునేందుకే సీఎం కేసీఆర్ 3.5 టీఎంసీలకు సామర్థ్యం పెంచి 10 గ్రామాలను, 10 వేల ఎకరాలను ముంచుతున్నారని నిందించారు. రూ.3,500 కోట్లు వెచ్చించి దోపిడీ చేసేందుకే డిజైన్లు మార్చారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు బలైందని రేవంత్ ధ్వజమెత్తారు. భూములు కోల్పోతున్న రైతులు ప్రశ్నిస్తే, 17మంది హత్యాయత్నం కేసులు నమోదు చేయించడం, ప్రజాభిప్రాయం లేకుండా డిజైన్లు మార్చడం దుర్మార్గమన్నారు. రైతులపై కేసులు బనాయించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే గ్రామాల పొలిమేరల్లోంచే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బాజిరెడ్డి గ్రామాల్లోకి రావద్దని బోర్డులు పెట్టాలని, అయినా వస్తే కళ్లల్లో కారం కొట్టి, కర్రు కాల్చి వాతలు పెట్టాలన్నారు. రైతుల భూముల జోలికొస్తే రాజకీయంగా సమాధి చేయాలన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం చేస్తామన్నారు.

పేపర్ లీకేజీలో కేసీఆర్ ఫ్యామిలీ పాత్ర

సిట్టింగ్‌జడ్జితో విచారణ చేయించాలి: రేవంత్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో రేవంత్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ అధికారి పోస్టుల పరీక్ష పేపర్ల లీకేజీలో కేసీఆర్ కుటుంబ సభ్యులు, కొందరు ఎమ్మెల్యేల పాత్ర ఉందని ఆరోపించారు. పేపర్ లీక్ అని, సైట్ హ్యాక్ అయిందని, హనీట్రాప్ అని మూడు రకాలుగా చెప్పడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శికి మాత్రమే తెలియాల్సిన పాస్‌వర్డ్ ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఎలా తెలిసిందని ప్రశ్నించారు. ప్రశ్నపత్రం స్ట్రాంగ్ రూమ్‌లోకి చైర్మన్, కార్యదర్శికి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ ప్రవీణ్ అనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎలా ప్రవేశించాడని, అతనికి పాస్‌వర్డ్ ఎలా తెలిసిందని రేవంత్ నిలదీశారు. కేసీఆర్ హయాంలో జరిగిన ప్రతి పోటీ పరీక్షపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రేవంత్ డిమాండ్ చేశారు.

బహిరంగ సభలకు అధిష్టానం పెద్దలు హాజరయ్యేలా చూడండి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కోరిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- 91 రోజుల పాదయాత్రలో మూడు బహిరంగ సభలకు అధిష్టాన పెద్దలకు ఆహ్వానం
- రాష్ట్రంలోని పార్టీ వ్యవహారాలపైనా చర్చ



సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన నివాసంలో కలిసిన భట్టి, ఈ నెల 16న బోథ్ నియోజకవర్గం బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ప్రారంభం కానున్న 'హాథ్ సే హాథ్ జోడో'పాదయాత్రకు అధిష్టానం అనుమతి కోరారు. పాదయాత్రకు సంబంధించి ఢిల్లీ నుంచి ఒక ప్రకటన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు రాష్ట్రంలో పార్టీకి సంబంధించిన తాజా వ్యవహారాలను, పార్టీ సీనియర్ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్ రావు థాక్రేకు రాసిన ఫిర్యాదు లేఖ అంశాన్ని ఖర్గేకు వివరించారు.

16 నుంచి 1,365 కిలోమీటర్ల పాదయాత్ర

భట్టి చేపట్టనున్న పాదయాత్ర మార్చి 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై జూన్ 15 వరకు మొత్తం 91 రోజుల పాటు 39 నియోజకవర్గాల మీదుగా మొత్తం 1,365 కి.మీ. కొనసాగనుంది. పాదయాత్ర ఏప్రిల్ మొదటివారానికి మంచిర్యాలకు చేరనుండగా..అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు చెందిన ఒక సీఎం హాజరుకావాలని అధిష్టానానికి భట్టి విజ్ఞప్తి చేశారు. శేర్ లింగంపల్లి నియోజకవర్గంలో నిర్వహించే సభకు ఏఐసీసీ ముఖ్యనేతలు, యాత్ర ముగింపు సందర్భంగా జూన్ 15న ఖమ్మంలోజరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ పాలిత రాష్ట్ర సీఎంతోపాటు ప్రియాంక లేదా రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యేలా చూడాలని భట్టి కోరారు.

రెండు వారాల్లోగా అద్దె చెల్లించండి

- నాగర్‌కర్నూల్ ఎక్సైజ్‌స్టేషన్ అద్దె చెల్లింపుపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ ఎక్సైజ్‌స్టేషన్ కోసం వినియోగించిన భవనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అద్దెను రెండు వారాల్లో చెల్లించాలని హైకోర్టు ఆదేశించినట్లు పిటిషనర్ తరపు న్యాయవాది కాశిరెడ్డి శశిధర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని రాజశ్రీకి చెందిన భవనాన్ని ఎక్సైజ్ స్టేషన్ నిర్వహణ కోసం అధికారులు 2012లో లీజుకు తీసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో నెలకు రూ. 15 వేలు అద్దె చెల్లిస్తామని చెబుతూ లీజు ఒప్పందం చేసుకుని 2021 వరకు యజమానికి అద్దె చెల్లించలేదన్నారు. దీంతో పిటిషనర్ జి.రాజశ్రీ హైకోర్టును ఆశ్రయించడంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అద్దె సొమ్మును రెండు వారాల్లోగా ఇంటి యజమానికి చెల్లించాలని ఎక్సైజ్ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయవాది శశిధర్ రెడ్డి వివరించారు.

అద్దె వాహనాల బిల్లులు చెల్లించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నడిపిస్తున్న అద్దె వాహనాల బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దె వాహనాలను అధికారులకు నడిపిస్తున్నామని, అందుకు గాను ప్రభుత్వం నుంచి బిల్లులు నెలల తరబడి రావడం లేదన్నారు. దీంతో వాహనాలను నడపలేక అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో నెల కిస్తులు కట్టలేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. అద్దె వాహనాలపైనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ, పంచాయతీ శాఖలతో పాటు వివిధ కార్యాలయాల్లో నెలల నుంచి బిల్లులు రావడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాదపూజతో పరవశించిన మనిగిళ్ల



తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీస్సులు తీసుకుంటున్న విద్యార్థులు

- జెడ్పీహెచ్‌ఎస్‌లో ముగిసిన అక్షరదీక్ష కార్యక్రమం



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మనిగిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో 41 రోజులుగా చేపట్టిన 'అక్షరదీక్ష' కార్యక్రమంతో గ్రామం పరవశించిపోయింది. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ఒకేసారి 120 మంది విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవాయిద్యాలతో పాఠశాలకు చేరుకోగా.. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ రవీందర్ మాట్లాడుతూ ప్రత్యక్ష దైవ స్వరూపులైన తల్లిదండ్రులకు పాదపూజ చేయడం విద్యార్థులు అదృష్టంగా భావించాలన్నారు. అక్షరదీక్ష కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వచ్చిన మార్పులను జీవితాంతం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమానికి విరమణ ఉండకూడదని, ఉన్నత శిఖరాలను చేరుకుని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పదో తరగతిలో విద్యార్థులు 10/10 జీపీఏ సాధించాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో డీఈఓ మాట్లాడుతూ పిల్లల బాగోగుల కోసం జీవితంలో స్థిరపడేదాకా వెన్నంటి ఉండాలన్నారు. తల్లిదండ్రులందరూ చక్కగా తయారై వాళ్ల పిల్లలను వెంటబెట్టుకొని పాఠశాలకు రావడం చూస్తుంటే దసరా పండుగా ముందుగానే వచ్చిందనే సంతోషాన్ని కలిగించిందని హెచ్ఎం శంకర్‌గౌడ్ అన్నారు. అక్షరదీక్షలో తల్లిదండ్రులు తమ పిల్లలను హత్తుకొని భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశంకర్, నిర్వాహకులు చంద్రశేఖర్, హెచ్ఎం ఉమాదేవి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సుఖేందర్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు శ్రీలక్ష్మి, జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుగౌడ్, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, విజయ్‌కుమార్, సురేఖ, చంద్రకళ, శ్రీరామ్, దివ్య, ఎస్ఎంసీ చైర్మన్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకే తొలిమెట్టు



వెల్గొండలో విద్యార్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

- అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ రాజశేఖర్‌రావు

బిజినేపల్లి: ప్రాథమిక స్థాయిలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడానికే తొలిమెట్టు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ రాజశేఖర్‌రావు అన్నారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను అందుబాటులో ఉంచుకుని తరగతి గదిలో విద్యార్థులకు బోధనా పద్ధతులను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. తల్లిదండ్రుల సమావేశాలు విధిగా నిర్వహించి విద్యార్థుల ప్రగతిని వారికి తెలియజేయాలన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వెల్గొండ, లట్టుపల్లి, మంగనూర్, వట్టెం, కేజీబీవీ విద్యాలయాలను ప్రత్యేకంగా పరిశీలించారు. పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో అమలు చేస్తున్న పాఠ్య ప్రణాళిక అంశాలు, బోధన పద్ధతులపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో చర్చించారు. వారాంతపు పరీక్షలు నిర్వహించి సబ్జెక్టుల వారీగా విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. మారిన ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో మెరుగయ్యేలా ఆయా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి బృందం సభ్యులు చంద్రశేఖర్, జగదీశ్వర్‌రెడ్డి, మణికంఠ, ఏఈఓ భాస్కర్ రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కులు సమాంతర కాల్వ ద్వారా 97 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 600, తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.


కృష్ణా తీరాన సినిమా షూటింగ్



సన్నివేశం చిత్రీకరణ

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట కృష్ణానది తీరాన, నల్లమల్ల అటవీ ప్రాంతం, పలు గ్రామాల్లో కొద్దిరోజులుగా సర్కార్ నౌకరి చిత్ర షూటింగ్ కొనసాగుతోంది. ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాశ్ హీరోగా, భావన వల్లపండల్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఆర్‌కే టెలిషో బ్యానర్‌పై దర్శకుడు గగమోని శేఖర్ ఈ చిత్రానికి దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. పక్కా పల్లెటూరి యాసలో చిత్రాన్ని నిర్మిస్తున్నామని.. మంగళవారం షూటింగ్ కొనసాగిందని వివరించారు. మరికొద్ది రోజులు చుట్టుపక్కల గ్రామాల్లోనే మరిన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తామని తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపు



నారాయణపేట టౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆకాశానంటే అందమైన భవనాలను నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వాలు మొండి చేయి చూపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2.60 లక్షల కార్డులు రెన్యువల్ కాకుండా పోయాయని ఆరోపించారు. సంక్షేమ బోర్డు ద్వారా వివాహం, ప్రసూతి సాయాన్ని రూ.లక్ష పెంచాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు సెస్ ద్వారా జమ అయ్యే రూ.వేల కోట్లు కార్మిక సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రాం, రాములు, శంకర్, చంద్రయ్య, అశోక్ పాల్గొన్నారు.

వేరుశనగ పంటకు నిప్పు

- రూ.లక్షల్లో నష్టం



దగ్ధమవుతున్న వేరుశనగ పంట



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గువ్వల

వంగూరు: ఆరుగాలం శ్రమించి రూ.లక్షల పెట్టుబడి పెట్టి పండించిన పంట అగ్గిపాలు కావడంతో రైతు కుటుంబం కన్నీటి పర్యంతమైంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని ఉప్పల్ పహాడ్‌కు చెందిన రైతు సుంకరి సైదులుగౌడ్ ఆరు ఎకరాల వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని వేరుశనగ సాగుచేశారు. పంట చేతికి రావడంతో భూమి నుంచి తీసి రాశిగా పోసి ఉంచారు. గ్రామ శివారులో భూమి ఉండటంతో సోమవారం రాత్రి పొద్దుపోయాక ఇంటికి వచ్చారు. అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు పంటకుప్పకు నిప్పంటించారు. గుర్తించిన గ్రామస్తులు వెంటనే రైతుకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసినా.. అప్పటికే పంట పూర్తిగా దగ్ధమైంది. రూ.7 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం, గ్రామస్తులు కోరుతున్నారు. రైతు సైదులుగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ కురుమూర్తి వివరించారు.

బాధిత రైతును ఆదుకుంటాం..

పంట నష్టపోయిన రైతు సైదులుగౌడ్‌ను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పంటకు నిప్పంటించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సైదులుగౌడ్‌కు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయడంతో పాటు పార్టీ, ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వివరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, గణేష్‌రావు, లాలూయాదవ్, రాజేందర్‌రెడ్డి, హమీద్ తదితరులు ఉన్నారు.